# ప్రచారమెక్కటి.. బోధన మరోటి




**అర్హత లేని టీచర్లు.. అరకొర జీతాలు • పట్టించుకోని విద్యశాఖ అధికారులు**

**నస్రుల్లాబాద్, రాజముద్ర న్యూస్:**

కామారెడ్డ జిల్లా నస్రుల్లాబాద్ మండలంలో పలు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రచారమొక్కటి చేస్తుండగా, బోధన మరో తీరులో సాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు విద్య హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి ప్రవర్తిస్తున్నా.., పర్యవేక్షణ కరువుతో వారికి అడ్డు అదుపు లేకుండా పోయింది. నస్రుల్లాబాద్ మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడి, విస్మరిస్తున్న నిబంధనలపై తీరుపై ప్రత్యేక కథనం.

**గైడ్స్ ఆధారంగా బోధన...?**

నస్రుల్లాబాద్ మండలంలోని కొన్ని పాఠశాలలో కార్పొరేట్ స్థాయి బోధన అంటూ ప్రచారం మెండుగా చేస్తున్నాయి. కాని ఆయా పాఠశాలల్లో అరకొర బోధన చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలో ఇంగ్లీష్ భాషపై పట్టు లేకపోవడంతో, విద్యార్థులు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక పలువురు టీచర్లు గైడ్స్ తెప్పించుకొని కాలం వెళ్లదీస్తున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. మరికొన్ని పాఠశాలలో కొన్ని తరగతులను రేకుల షెడ్డులోనే బోధన సాగిస్తున్నట్లు విరమ్శలున్నాయి.

**పట్టించుకోని అధికారులు..**

పలు పాఠశాలలు విద్య హక్కు చట్ట నిబంధనలు పాటించడం లేదు. మరికొన్ని పాఠశాలల తీరు మరింత ఆశ్చర్యకరంగా ఉంది. తమ పిల్లలు ఏదైనా మర్చిపోతే తీసుకెళ్లి ఇద్దామన్నా.., పాఠశాలలో ఏదైన ప్రోగ్రామ్ జరిగినా ఫేరెంట్స్ను అనుమతించడం లేదని, పాఠశాల గేటు బయటే నిల్చొబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు విద్యార్థులను ఫీజుల విషయంలో ఆరు బయట ఎండలో నిల్చొబెడుతున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలు పాఠశాలల నిబంధనల విస్మరణ విద్యశాఖ అధికారుల దృష్టికి వెళ్లినా చూసీచూడనట్లు ఉండటంపై వారి తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఏది ఏమైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు పాటించని ఆ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

## బ్రాహ్మణ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన ఇంగువ రామకృష్ణకు బీజేపీ నేతల సన్మానం



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, నేలకొండపల్లి గ్రామానికి చెందిన ఇంగువ రామకృష్ణ అఖిల భారత బ్రాహ్మణ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువమోర్చా ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు అనంత ఉపేందర్ గౌడ్, దళిత మోర్చా ఖమ్మం జిల్లా కార్యదర్శి కొమరబత్తిని వెంకన్న హాజరయ్యారు. బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు గోవిందరావు, బాజా రామకృష్ణ, ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, కొండ హర్షవర్ధన్, కిసాన్ మోర్చా మండల నాయకులు సూరేపల్లి జ్ఞానరత్న, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పిట్టల సూరిబాబు, బీజేపీ సోషల్ మీడియా మండల ఇంచార్జి కందర బోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై శంకర్ పల్లిలో బిఆర్ఎస్ వంటావార్పు..





**ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బిఆర్ఎస్ నేతల ఆరోపణ**

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శంకర్ పల్లి ప్రధాన చౌరస్తాలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ వంటావార్పు కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.... కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 1000 రోజుల పాలన పూర్తయినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, దివ్యాంగులకు పెన్షన్ పెంపు తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మాజీ ఎంపిపి ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... 1000 రోజుల పాలనలో కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీ లేదని, ఎప్పుడు చూసినా కెసిఆర్ ను తిట్టడం, బిఆర్ఎస్ నాయకులపై నిందలు వేయడంతోనే సరిపోయిందని ఆయన కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుపట్టారు. ప్రజాపాలన అంటూ కాలక్షేపం చేస్తూ ప్రజలపై గ్యాస్ సబ్సిడీ తీసివేసి, 4000 పింఛన్ అని చెప్పి ఇప్పుడు 2000/- రూపాయలు మాత్రమే ఇస్తూ, ప్రతి మహిళకు గృహజ్యోతి పథకం కింద 2500 రూపాయలు ఇస్తామని చెప్పి, ఇప్పటివరకు 33 నెలల బకాయి చెల్లించాలని, బాకీకరణ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి సూచించారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వెయ్యి రోజుల పాలనపై ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాల షెడ్యూల్‌లో సెప్టెంబర్ 4న మహిళలు, పింఛన్‌దారులకు సంబంధించిన హామీల అమలుపై వంటావార్పు కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు బద్దం శశిధర్ రెడ్డి, జిల్లా నాయకులు వాసుదేవ్ కన్నా, కౌన్సిలర్ ఉషా విజయకుమార్, వసంత మహేందర్ రెడ్డి, ప్రశాంత్ కుమార్, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

## వార్డు సభ్యులు హక్కులను వినియోగించుకోవాలి



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల వార్డ్ మెంబర్స్ ఫోరం కమిటీ సభ్యులు తమ హక్కులను వినియోగించుకోవాలని మద్దికుంట, జగదాంబ తండా, వివిధ గ్రామాల ను పర్యటించి , వార్డ్ సభ్యుల సమస్యలను, వారి హక్కులను గురించి చర్చించి గౌరవ వేతలనల గురించి మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రామారెడ్డి మండల వార్డు సభ్యుల అధ్యక్షుడు చేన్నంశెట్టి ప్రశాంత్ , ఉపాధ్యక్షుడు కరికే సత్యరాజ్ ,ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ జెసిబి శేఖర్, సలహాదారులు రెడ్డి మల్లేష్,వార్డు సభ్యులు హరీష్, నూతనంగా ఏర్పడిన నూతన కమిటీ సభ్యులకు వార్డ్ మెంబర్ సన్మానం చేశారు ఆయా గ్రామాల వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ పోరాటంలో 'గురువు'... పాఠశాలలా.. బందీఖానాలా...?

- గురువుల పాలిట శాపంగా మారుతున్న కాఠిన్యం
- ఆత్మగౌరవం కోల్పోతున్న 'గురువు' ఆవేదన...



**బీర్కూర్, బాన్సువాడ, రాజముద్ర న్యూస్:** తరగతి గదిలో క్రమశిక్షణ నేర్పడమే ఉపాధ్యాయుడు చేసిన నేరమా? విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే గురువు ఆకాంక్ష, నేడు వారి పాలిట శాపంగా మారుతోంది. కరోనా తదనంతర పరిణామాల్లో విద్యార్థుల ప్రవర్తనలో వచ్చిన మార్పులు, స్మార్ట్‌ఫోన్ల విపరీతమైన వాడకం విద్యావ్యవస్థ మూలాలనే కదిలిస్తున్నాయి. నిత్యం ఫోన్లలో కాలక్షేపం చేస్తూ, చెడు వ్యసనాలకు అలవాటు పడి, చిన్న విషయాలకే సహనం కోల్పోతున్న నేటి తరం ప్రవర్తన సమాజాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోన్న పరిస్థితులపై " ప్రత్యేక కథనం. విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో ఉన్నతమైన స్థానంలో నిలబెట్టాలనే తపనతో గురువులు చూపే చిన్నపాటి కాఠిన్యమే నేడు వారి పాలిట శాపంగా మారుతోంది. కరోనా మహమ్మారి తదనంతర పరిణామాల్లో విద్యావ్యవస్థ స్వరూపమే మారిపోయింది. సాంకేతికత పేరిట పిల్లల చేతుల్లోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్లు, విపరీతమైన (చెడు ) అలవాట్లు నేడు విద్యాప్రమాణాలను దిగజార్చడమే కాకుండా, విద్యార్థుల మానసిక సమతుల్యతను సైతం దెబ్బతీస్తున్నాయి. నిత్యం ఫోన్లకే పరిమితమవుతూ, చిన్నపాటి విషయాలకే ఈర్ష్య, ఆవేశం ప్రదర్శిస్తున్న నేటి తరం ప్రవర్తన సమాజాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.అంతే కాకుండా ప్రభుత్వాల కొన్ని ఆంక్షల కారణంగా ఉపాధ్యాయులు కొట్టుమిట్టాడుతున్నారు.

**"నాన్నా! మీరు స్కూల్లో పనిచేస్తున్నారా.. జైలులోనా?"**

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక ఉపాధ్యాయుని ఆవేదన పూరిత కథనం నేటి సమాజపు చేదు నిజాలకు అద్దం పడుతోంది. సమయానికి వేతనం అందుతున్నప్పటికీ, రోజువారీ అవమానాలు భరించలేక హెడ్‌మాస్టర్ టేబుల్‌పై రాజీనామా పత్రం ఉంచే పరిస్థితిలో ఉపాధ్యాయుల ఆత్మఘోష ఇది.

ప్రతి చిన్న విషయానికి తన ఉద్దేశాన్ని నిరూపించుకోవాల్సి రావడం, తల్లిదండ్రులు విద్యార్థుల ముందే టీచర్లకు హెచ్చరికలు జారీ చేయడం వంటి వాతావరణంలో బోధన ఎలా సాధ్యమవుతుంది? తన చిన్న కుమారుడు అడిగిన ఒక్క ప్రశ్న—"నాన్నా! మీరు స్కూల్లో పాఠాలు చెప్తున్నారా లేక జైలులో పనిచేస్తున్నారా?"—ఆ గురువు గొంతును పూడ్చివేసింది. మనిషి పేదరికాన్ని భరించగలడు, తక్కువ జీతాన్ని భరించగలడు.. కానీ అనునిత్యం ఆత్మగౌరవం దెబ్బతింటుంటే లోపలి నుండి విరిగిపోతాడు. ఉపాధ్యాయుడికి కేవలం వేతనం మాత్రమే కాదు; సమాజం ఇచ్చే గౌరవం, విశ్వాసం, మర్యాద అత్యంత అవసరం.

**దిగజారుతున్న నైతిక విలువలు – మౌనంలో తల్లిదండ్రుల ఆవేదన..**

రోడ్డుపై ఒక విద్యార్థి అల్లరి చేసినా లేదా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినా.. "నీకు పాఠశాలలో ఇదే నేర్పారా? నీ తల్లిదండ్రులు ఎవరు?" అని సమాజం నిలదీస్తుంది. కానీ, అటువంటి ప్రశ్న ఎదురైనప్పుడు కూడా నేటి విద్యార్థుల్లో కనీస పశ్చాత్తాపం కరువవుతోంది. తమ ప్రవర్తన వల్ల కన్నవారి శ్రమ, నేర్పిన గురువుల ప్రతిష్ట మసిబారుతోందన్న స్పృహ లోపిస్తోంది. పిల్లలకు కావలసిన సదుపాయాలు సమకూర్చడమే కాకుండా, వారి మానసిక ధోరణిని, ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

**భావి భారత పౌరులకు – నవసమాజ మార్గదర్శనం..**

సాంకేతికతకు బానిసలు కాకుండా స్మార్ట్‌ఫోన్ జ్ఞానాన్ని పెంచే సాధనం మాత్రమే. నిత్యం ఫోన్లలో కాలక్షేపం చేస్తూ మానసిక ఆరోగ్యాన్ని, అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకోకండి.క్రమశిక్షణే విజయసోపానంగా గురువులు ప్రదర్శించే కఠినత్వం వెనుక మీపై ఉన్న ప్రేమ, ఉజ్వల భవిష్యత్తును అందించాలనే ఆరాటమే దాగి ఉన్నాయి. సమాజంలో మీ ప్రవర్తన మీ కుటుంబానికి, విద్యాసంస్థకు గుర్తింపు తెస్తుందనే విషయాన్ని సదా గుర్తుంచుకొని, ఆత్మపరిశీలన చేసుకోవాలి. గురుదేవోభవగా భావించడం, ఉపాధ్యాయులను గౌరవించడం.. అంటే మన సంస్కారాన్ని కాపాడుకోవడమే. ఉపాధ్యాయులు కేవలం పుస్తకాల్లోని పాఠాలు మాత్రమే బోధించరు.. తరాల నడవడికను తీర్చిదిద్దుతారు. ఉపాధ్యాయుడికి లభించే గౌరవమే ఈ దేశ భవిష్యత్తుకు బలమైన పునాది. విద్యావ్యవస్థను, గురువు మహోన్నత స్థానాన్ని కాపాడుకోవడానికి సమాజం, తల్లిదండ్రులు, విద్యార్థులు పునరంకితం కావాల్సిన అత్యవసర సమయం ఇది...పి. విఠల్ డీఎడ్, ప్రైవేట్ మాజీ ఉపాధ్యాయుడు.

## వరి విత్తనాల నమోదు తప్పనిసరి

- 5 శాతం బోనస్ పొందేందుకు రైతులు నమోదు చేసుకోవాలి
- వికారాబాద్ మండల వ్యవసాయ అధికారి ప్రసన్న లక్ష్మి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ మండలంలోని రైతులు ప్రభుత్వం నిర్దేశించిన ఏడు రకాల వరి విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేసినట్లయితే 5 శాతం బోనస్ పొందేందుకు తమ విత్తన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వికారాబాద్ మండల వ్యవసాయ అధికారి ప్రసన్న లక్ష్మి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఏడు వరి రకాలు:

1.ఆర్ ఎస్ ఆర్ 15048
2. హెచ్ ఏం టి
3. బీపీటీ 5204
4. డబ్ల్యూ జి ఎల్ 44
5. జై శ్రీరామ్
6. కె ఎస్ ఎం 1638
7. . కె ఎస్ ఎం 7715

డీలర్ల వద్ద పై వరి రకాల విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు సంబంధిత విత్తన డీలర్లను సంప్రదించి తమ విత్తనాల వివరాలను నమోదు చేసుకోవాలి. రైతులు సొంత విత్తనాన్ని వినియోగించినా లేదా పరిశోధనా కేంద్రాల నుండి విత్తనం కొనుగోలు చేసినా, సంబంధిత డిక్లరేషన్‌తో తమ వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల ( ఏ ఈ ఓ ) వద్ద 2026 సెప్టెంబర్ 9వ తేదీలోగా నమోదు చేసుకోవాలి. సెప్టెంబర్ 9వ తేదీలోగా విత్తనాల నమోదు పూర్తి చేయని రైతులకు 5 శాతం బోనస్ ప్రయోజనం అందదు. కాబట్టి రైతులు ఎటువంటి ఆలస్యం చేయకుండా గడువులోగా తమ విత్తనాల నమోదును పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు. డీలర్లు కూడా తమ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి, గడువులోగా నమోదు పూర్తయ్యేలా సహకరించాలని సూచించారు.

- మండల వ్యవసాయ అధికారి,వికారాబాద్

## కనక రాజు నూతన గృహప్రవేశంలో కొండూరి రవీందర్రావు

**రాజముద్ర న్యూస్, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రంలోని నాలుగో వార్డు సభ్యుడు గ్యార దేవరాజు సోదరుడు కనక రాజు నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్రావు హాజరై నూతన గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కనక రాజు కుటుంబ సభ్యులను ఆశీర్వదించిన నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నాయకులు, ప్రజాప్రతినిధుల రాకతో గృహప్రవేశ వేడుక సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామి, గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, వార్డు సభ్యులు రెడ్డిమల్ల రాజనర్సు, సుంకరి ప్రశాంత్, ఏగదండి స్వామి, నాయకులు గంధ్యాడపు రాజు, చీరాల నిఖిల్గౌడ్, ఇరిగి సందీప్, బండ రాజు, ఏగదండి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలో ఎమ్మెల్యే మదన్మోహన్ ఆదేశాల మేరకు 13వ వార్డులో ఐదు లక్షలతో కాంట్రాక్టర్ నిర్మించే ఇంద్రమ్మ ఇల్లును భూమి పూజ చేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్, ఉప సర్పంచ్ నవీన్, 13వ వార్డు మెంబర్ ఈసాయిపేట్ హరీష్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# నాటు వైద్యం వికటించి మహిళ మృతి

**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నాటు వైద్యం వికటించడంతో ఓ మహిళ మృతిచెందినట్లు సమాచారం. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన సుమారు 50 ఏళ్ల గొల్లమందల కుమారి కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతూ పేరువంచలోని చైతన్య నగర్కు చెందిన ఓ నాటు వైద్యుడిని ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆమెకు నాటు పసర ఇవ్వగా, అది సేవించిన అనంతరం తీవ్ర కడుపునొప్పి, వాంతులతో ఇబ్బంది పడినట్లు సమాచారం. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుమారి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో చంద్రుపట్ల గ్రామంలో విషాదం నెలకొంది. నాటు వైద్యం కారణంగానే మృతిచెందిందా..? ఇతర ఆరోగ్య సమస్యలతో మృతి సంభవించిందా..? అనే విషయాలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

# పోలీస్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** జిల్లాలో కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో 60 రోజుల ప్రత్యేక ఉచిత శిక్షణ బ్యాచ్ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. వంద మంది కానిస్టేబుల్, వంద మంది ఎస్సై అభ్యర్థులకు శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తులను ఈనెల 11లోగా అందించాలని, 17, 18 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని, 19న శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందులో భాగంగా అభ్యర్థులకు ఉచిత పుస్తకాలు అందించడంతో పాటు, ప్రతిరోజూ నిపుణులైన అధ్యాపకులతో నాలుగు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారానికి ఒకసారి పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించి అభ్యర్థుల ప్రతిభను అంచనా వేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులు బీసీ స్టడీ సర్కిల్, ఆదిలాబాద్లో కొనసాగుతాయని తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్: 08732-221280, 9949684959, 9494149416 సంప్రదించాలని సూచించారు.

# బోథ్లో ఘనంగా ప్రజా పాలన సంబరాలు



**రాజముద్ర న్యూస్, బోథ్:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా బోథ్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మిఠాయిలు పంచుకుంటూ, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన ప్రజలకు భరోసా కల్పించేలా కొనసాగిందన్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, మైనార్టీలు, విద్యార్థులు సహా అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేరుగు భోజన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, నక్కలవాడ సర్పంచ్ నవీన్, జిల్లా కార్యదర్శి వినయ్రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మేరుగు దాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆశన్న, జిల్లా ఉప సర్పంచ్ల ఉపాధ్యక్షుడు అరుణ్కుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్, తాజా మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్రెడ్డి భూముల చుట్టూ తిరుగుతున్నారు

- సిర్పూర్–కాగజ్నగర్లో 42,867 ఎకరాలు 22ఏ జాబితాలో బందీ
- సిర్పూర్ సభలో మాజీ మంత్రి హరీశ్రావు తీవ్ర విమర్శలు




**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే.. కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూ సీఎం రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ సిర్పూర్ నియోజకవర్గం కౌటాల మండలంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ నిర్వహించిన నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద రైతుల భూములు గుంజుకోవద్దు, వారి గొంతు నొక్కొద్దని కోనప్ప ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తే రైతుల కష్టాలు చూసి బాధేసిందన్నారు. ఒక్క సిర్పూర్ కాగజ్నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. మండలాల వారీగా కౌటాలలో 6,350 ఎకరాలు, చింతలమానేపల్లిలో 8,878 ఎకరాలు, బెజ్జూరులో 8,325 ఎకరాలు, కాగజ్నగర్లో 6,690 ఎకరాలు, సిర్పూర్ టీలో 4,406 ఎకరాలు, పెంచికల్పేట్లో 2,950 ఎకరాలు, దహేగాంలో 5,268 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. కేసీఆర్ గిరిజనులకు పోడు భూముల పట్టాలు ఇచ్చి ఆదుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న భూములను లాక్కునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. 22ఏ జాబితాలో భూములు చేరడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బ్యాంకులకు రుణాల కోసం వెళ్లిన రైతులను తిరస్కరిస్తున్నారని, భూములను విక్రయించి కుమార్తెల వివాహాలు చేయాలనుకున్నా రిజిస్ట్రేషన్లు జరగడం లేదని తెలిపారు. భూములు లేవని బ్యాంకు మేనేజర్లు గెంటేస్తున్నారు.. పెళ్లిళ్లు ఆగిపోతున్నాయి.. ఇది ఇందిరమ్మ రాజ్యమా..? కబ్జాల రాజ్యమా..? అని ప్రశ్నించారు. రైతులను కబ్జాదారులుగా, దొంగలుగా అభివర్ణించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద రైతులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్లో ముఖ్యమంత్రి నివాసం 22ఏ జాబితాలో చేరినప్పుడు వెంటనే తొలగించుకున్నారని ఆరోపిస్తూ, రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం, పేద రైతులకు మరో న్యాయమా..? అని ప్రశ్నించారు. సిర్పూర్ నియోజకవర్గంలోని రైతుల భూములను వెంటనే 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ అంశంపై అసత్యాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా రేవంత్ రెడ్డి నిషేధించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన తీవ్ర విమర్శలు చేశారు. కొత్త పెన్షన్లు ఇవ్వలేదని, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, దళితబంధు వంటి పథకాలు నిలిచిపోయాయని ఆరోపించారు. నెలకు రూ.4వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ప్రతి అవ్వకు, తాతకు ప్రభుత్వం రూ.66వేలు, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి పెద్ద మొత్తంలో బకాయిలు పెట్టిందన్నారు. వీటిని వడ్డీతో సహా వసూలు చేస్తామని హెచ్చరించారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని, త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూముల అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అన్నారు. కోనప్ప, ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఇద్దరూ ఇప్పుడు ఒక్కటయ్యారని, ఇక ఇక్కడ ఏ శక్తి ఎదురొచ్చినా తుఫాన్లో కొట్టుకుపోవాల్సిందేనని రావు వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గంలో ఎవరెన్ని కుట్రలు చేసినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతుల భూములు వారికి దక్కేంత వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా పోరాడుతుందని స్పష్టం చేశారు.




# కాలువ పనుల్లో నాణ్యత ఏది..?

- మాణిక్ గూడలో కుడి కాలువ పనులను సందర్శించిన నాయకులు

**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ రూరల్:** జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మాణిక్ గూడ గ్రామంలో చేపట్టిన కుడి కాలువ మరమ్మత్తు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, దీనిపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మాణిక్ గూడ గ్రామంలో సీపీఎం బృందం పనులను నేరుగా పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్ మాట్లాడుతూ మరమ్మత్తు పనుల నాణ్యతపై అధికారుల పర్యవేక్షణ లోపించిందని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన స్వల్ప వర్షానికే కాలువ గట్టు మట్టి కొట్టుకుపోవడంతో పాటు సీసీ రోడ్డు ధ్వంసమైందని, దీనివల్ల స్థానిక ప్రజలకు, ముఖ్యంగా చిన్న పిల్లలకు రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. మాణిక్ గూడ కాలువ మరమ్మత్తు పనుల నాణ్యతపై సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని, ధ్వంసమైన కాలువ, సీసీ రోడ్డుకు తగిన మరమ్మత్తులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిసెల కార్తీక్, రాజేందర్, అశోక్, నాయకులు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



# 2029లో తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యం

- జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఉడువుల యాదగిరి

**రాజముద్ర న్యూస్, గంభీరావుపేట:** 2029లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో ఐక్యంగా పనిచేయాలని జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఉడువుల యాదగిరి పిలుపునిచ్చారు. గంభీరావుపేట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిలా భావిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ పెంచాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ పొన్నాల మహేష్, బండ దేవయ్య, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, ధార్మిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వజిత్ హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

**రాజముద్ర న్యూస్, తాండూర్:** రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి విమర్శించారు. శుక్రవారం మండలంలోని అచలాపూర్ గ్రామంలో ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి, కరపత్రాలతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, డీజిల్, విద్యుత్ తదితర సాగు ఖర్చులు భారీగా పెరిగినప్పటికీ రైతులు పండించిన పంటలకు తగిన ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు గుర్తింపు లేకపోవడం, రుణభారం పెరగడం, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతుండటం ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈనెల 8, 9 తేదీల్లో మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులు, కూలీలు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల కన్వీనర్ గొంగర్ల దినేష్, నాయకులు వేముర్ల మొండి, ఆరేపల్లి బక్కయ్య, లక్ష్మి, దాగం గంగారం, కె.లక్ష్మి, మల్లేష్, రాజు, ఎల్లయ్య, పుల్లయ్య, శేఖర్, రాజేశ్వరి, శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



